క్లుప్తంగా

ఆట్యా-పాట్యాలో సత్తా చాటాలి



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన డాక్టర్ వాసు రెడ్డి

కర్నూలు (టౌన్): పల్నాడు జిల్లాలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ ఆట్యా-పాట్యా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని అంకాలజిస్టు డాక్టర్ వాసు రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రస్ అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల వల్ల విద్య, ఉద్యోగాల్లో రాణించవచ్చన్నారు. జిల్లా ఆట్యా-పాట్యా సంఘం సీఈఓ నాగరత్నమయ్య వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటలక్ష్మీ, చరణ్ పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫాం పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి ఈగల్ హంటర్ ఏజెన్సీ నిర్వాహకులు బుధవారం యూనిఫాం పంపిణీ చేశారు. వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామన్నారు. కొత్త యూనిఫాంతో సిబ్బంది మరింత క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. సెక్యూరిటీ ఏజెన్సీ ఏరియా మేనేజర్ కేజే.రెడ్డి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో భద్రతా ప్రమాణాలు మరింత కట్టుదిట్టం చేయడానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. అడ్మినిస్ట్రేటర్లు సింధు సుబ్రహ్మణ్యం, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

చిరు వ్యాపారులపై వేధింపులు ఆపాలి

కర్నూలు(సెంట్రల్): రోడ్డు పైడు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారిపై మునిసిపల్ అధికారుల వేధింపులు ఆపాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌దేశాయ్, ఎం విజయ్‌రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మునిసిపల్ అదనపు కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. చిరు వ్యాపారాలు చేసుకునే వారిని కొందరు అధికారులు ట్రాఫిక్ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. నాయకులు మహ్మద్, కుమార్, సాల్మన్‌రాజు, ఎస్ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

స్త్రీ ఆరోగ్యం కుటుంబ బలం

కర్నూలు(హాస్పిటల్): స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబాలు బాగుంటాయని జిల్లా మాస్ మీడియా అధికారి (డెమో) శ్రీనివాసులు శెట్టి చెప్పారు. బుధవారం స్థానిక కొత్తపేట యూపీహెచ్‌సీ పరిధిలోని సచివాలయంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. అక్టోబర్ 2వ తేదీ వరకు మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 30 ఏళ్లు దాటిన మహిళలకు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ గుర్తించేందుకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు చిన్నరాముడు, నాగమల్లేశ్వరి, కళ్యాణి, సుజాత, భువనేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతా కార్యక్రమాలు

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి బ్యాంకులు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నాయి. ఏక్ దిన్.. ఏక్ గంటా, ఏక్ సాథ్ కింద అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టనున్నారు. అలాగే అన్ని బ్యాంకులు ఈ కార్యక్రమాలు చేపట్టనున్నాయి.

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం

కర్నూలు(సెంట్రల్): శాశ్వత లోక్ అదాలత్ చొరవతో ఆదోనిలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారమైంది. శ్రీలక్ష్మమ్మవ్వ ఎంటర్ ప్రైజెస్‌లో కంతులు కడితే ఇళ్ల స్థలాలు చూపుతామని యజమానులు ఆశ చూపడంతో కొందరు కట్టారు. అంతేగాక డిప్ సిస్టమ్‌లో తగిలిన వారికి ఉచితంగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే వారు స్థలాలు చూపకపోవడంతో కొందరు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజబాబు ప్రతివాదులకు నోటీసులు ఇచ్చి బుధవారం ఇద్దరి సమక్షంలో వాదులకు స్థలాలను చూపడంతో సమస్య సద్దుమణిగినట్లు ప్రకటించారు.

ఆరోగ్య సలహాదారు ఫార్మసిస్టు

- ఔషధాల వినియోగంపై రోగులకు సూచనలు, సలహాలు
- వైద్యుల ప్రిస్కిప్షన్‌తో మందుల పంపిణీ
- జిల్లాలో 9 వేల మంది ఫార్మసిస్టులు
- మెడికల్ షాపులలో వారిదే కీలక పాత్ర
- నేడు వరల్డ్ ఫార్మసిస్ట్ డే



కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో చేరిన రోగికి ఎలాంటి వైద్యం, చికిత్స అందించాలనేది వైద్యులు నిర్ణయిస్తారు. కానీ ఇంటి వద్ద ఉండే వ్యక్తికి ఏదైనా అనారోగ్యం చేస్తే ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దే చికిత్స తీసుకోవాల్సి వస్తే అలాంటి వారికి వైద్యులు సూచించిన మందులను మెడికల్ షాపుల్లోని ఫార్మసిస్టులు అందించి ఏ మందు ఎలా వాడాలో, ఏ సమయంలో వాడాలో సూచించి, అవసరమైతే ప్రత్యేకంగా ప్యాక్ చేసి ఇస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణకు ఫార్మసిస్టులు అందిస్తున్న అమూల్యమైన సహకారాన్ని గౌరవించేందుకు ఏటా సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ యేడాది 'ఆరోగ్యం గురించి ఆలోచించండి, ఫార్మసిస్టు గురించి ఆలోచించండి' అనే నినాదాన్ని ప్రవేశపెట్టారు.

ఉమ్మడి జిల్లాలో 3,100కు పైగా రిటైల్ మెడికల్ షాపులు ఉన్నాయి. అందులో కర్నూలులో 1800, నంద్యాల జిల్లాలో 1300 దుకాణాలు ఉన్నాయి. వీటితో పాటు హోల్‌సేల్ దుకాణాలు మరో 700 దాకా ఏర్పాటయ్యాయి. వాటిలో మొత్తం 9 వేల మందికి పైగా ఫార్మసిస్టులు సేవలందిస్తున్నారు. ఔషధ నియంత్రణ శాఖ ఈ దుకాణాలకు లైసెన్సులు, వాటి రెన్యువల్స్ జారీ చేస్తుంది. ఉమ్మడి జిల్లాలోని ఈ కార్యాలయం కర్నూలులో ఉంది. ఇందులో డీడీ, ఏడీ స్థాయి అధికారితో పాటు కర్నూలులో మూడు, నంద్యాలలో రెండు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు ఉన్నాయి. కాగా ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల సమయం నుంచి ఒక డీడీ, కర్నూలు, ఆదోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా మారాయి. నంద్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న కర్నూలు ఇన్‌ఛార్జిగా, కర్నూలు రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాం ఆదోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వారి పరిధిలోని మందుల దుకాణాలు, ఏజెన్సీలలో మందుల నాణ్యతను పరిశీలిస్తూ ఉంటారు. అనుమానం వచ్చిన మందులను ల్యాబోరేటరీకి పరిశీలనకు పంపి, వాటిలో లోపం ఉంటే సంబంధిత విక్రయదారుడు, తయారీదారులపై చర్యలు తీసుకుంటారు. ఈ క్రమంలో రోగుల ఆరోగ్య పరిరక్షణలో ఈ విభాగం కీలక పాత్ర పోషిస్తోంది. దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో 9వేల దాకా వేలకు పైగా ఫార్మాసిస్టులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రైవేటు ఆసుపత్రుల్లో, మెడికల్‌షాపులు, ఫార్మాకంపెనీల్లో వీరు సేవలందిస్తున్నారు.

ఫార్మసిస్టుల విధులు

- ముఖ్య ఔషధాలను రోగులకు అందుబాటులో ఉంచడం, వాటి వినియోగంపై అవగాహన కల్పించడం.
- రోగులకు ఆరోగ్య సలహాలు అందించడం, వైద్య పరీక్షలు నిర్వహించడం, ప్రజారోగ్య ప్రచారాలలో పాల్గొనడం, కొత్త ఔషధాల పరిశోధన, అభివృద్ధిలో పాల్గొనడం.
- ఫార్మసిస్టులు ఫార్మకోవిజిలెన్స్‌లో కూడా నాయకత్వం వహిస్తారు. యాంటిబయాటిక్స్ మందుల వాడకంపై సూచనలు చేస్తారు.

ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టుల కీలక పాత్ర

- రోగులకు వైద్యులు రాసిన ప్రిస్కిప్షన్‌ను సమీక్షించడం
- మందుల నిర్వహణ, దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించడం
- ఔషధ పరస్పర చర్యలు, అలర్జీలను పర్యవేక్షించడం, నిరోధించడం

మందుల వాడకంలో చైతన్యపరచాలి



రోగులకు వైద్యులు సూచించిన మేరకు మందులను ఇవ్వడం, అవి ఎలా వాడాలో చెప్పడం ఫార్మసిస్టుల బాధ్యత. ఫార్మసిస్టుల పర్యవేక్షణలో మెడికల్ షాపుల్లో మందుల క్రయ విక్రయాలు జరగాలి. రోగులకు నాణ్యమైన ప్రమాణాలు కలిగిన మందులను అందించి వారి ఆరోగ్య సంరక్షకులుగా ఉండాలి. ఫార్మసిస్టులు సొంతంగా వ్యాపారం చేయాలి. ఇతరులు మెడికల్ షాపులు నిర్వహించుకునేందుకు వారి సర్టిఫికెట్లను ఇవ్వకూడదు.
– ఏటీవీ.రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ, కర్నూలు

ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయించొద్దు



ఔషధ దుకాణదారులు వారి వద్దకు వచ్చే రోగులకు ప్రిస్కిప్షన్ లేనిదే మందులు విక్రయించరాదు. ముఖ్యంగా నార్కోటిక్స్ డ్రగ్స్‌తో పాటు యాంటిబయాటిక్స్, స్టెరాయిడ్స్, నొప్పుల మందులకు తప్పనిసరిగా వైద్యుల ప్రిస్కిప్షన్ చూసి ఇవ్వాలి. ప్రజలు సొంత వైద్యం మానుకుని క్వాలిఫైడ్ వైద్యుల వద్ద చికిత్స చేయించుకుని వారి సూచన మేరకు మందులు వాడాలి. ప్రతిసారీ పాతచీటితో మందులు కొని వాడితే కొన్నిసార్లు దుష్ప్రభావాలు కలిగే ప్రమాదం ఉంది.
– పి.హనుమన్న, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, కర్నూలు, నంద్యాల

నేడు సంగీత విభావరి

కర్నూలు(అర్బన్): ఆర్కెస్ట్రా కళాకారుల సంక్షేమం కోసం ఏర్పాటైన ప్రకాష్ గ్రూప్ మెలోడీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన సాయంత్రం 6 గంటలకు స్థానిక లలితా కళా సమితిలో తెలుగు, హిందీ సుమధుర గీతాల సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బీవీ ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కళారత్న పత్తి ఓబులయ్య, ఏపీఎస్‌పీ డీఎస్‌పీ మహబూబ్‌బాషా, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కే.వెంకటరాముడు, రిటైర్డు డీఎస్‌పీ ఎస్. మధుభూషన్ రావు, ఏపీఎన్‌జీఓ నాయకులు ఆర్‌వీ రమణ, 2వ వార్డు కార్పొరేటర్ జీఏ లతీఫ్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారని ఆయన బుధవా రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ప్రము ఖ గాయనీ, గాయకులు పాల్గొనే ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

కర్నూలు (టౌన్): కర్నూలు నగర పరిధిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు గురువారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. నగర ప్రజలు తాగునీరు, వీధి దీపాలు, రహదారుల మరమ్మతులు, పారిశుద్ధ్యం, ఇతర మౌళిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలపై 08519-221847 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పుస్తకాలు చదివి జ్ఞానం పెంచుకోవాలి



డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులకు పుస్తకాలను అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది

కర్నూలు(సెంట్రల్): పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.కబర్ది న్యాయవాదులకు సూచించారు. బుధవారం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ తరఫున డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన లా లైబ్రేరీని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట ప్రసాదుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఇందులో సుప్రీంకోర్టు, హైకోర్టులకు సంబంధించి పలు తీర్పులకు చెందిన పుస్తకాలు ఉన్నాయని, వాటిని న్యాయవాదులు చదివి విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు.

యువత సమాజ సేవలో ముందుండాలి



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ వెంకట బసవరావు తదితరులు

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ సమాజానికి సేవ చేయాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య వి.వెంకట బసవరావు పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథక దినోత్సవం పురస్కరించుకుని బుధవారం వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ శాఖ వారు సేవా పర్వ్ కార్యక్రమంలో భాగంగా వాయు కాలుష్య నివారణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, వినియోగాన్ని తగ్గించడంపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పించడం హర్షణీయమన్నారు. పాండిచ్చేరి కేంద్ర విశ్వవిద్యాలయం నుంచి విచ్చేసిన ఎస్.పనీర్ సెల్వం, ఎస్.దినేష్‌లను వీసీ అభినందించారు. వర్సిటీ రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి మాట్లాడారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 'క్లీన్ ఎయిర్ అండ్ ప్లాస్టిక్ ఫ్రీ సిటీ' అనే అంశంపై యూనివర్సిటీ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీడీఎం అభివృద్ధికి కృషి



డ్రోన్ టెక్నాలజీపై ఎంపీకి వివరిస్తున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది

కర్నూలు (సిటీ): నగర శివారులోని ట్రిపుల్ ఐటీడీఎంను మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆయన బుధవారం ట్రిపుల్ ఐటీడీఎంను సందర్శించి అక్కడి సమస్యలపై రిజిస్ట్రార్‌తో పాటు వివిధ విభాగాల హెచ్‌ఓడీలతో చర్చించారు. కాలేజీలోని డ్రోన్ టెక్నాలజీ ల్యాబ్‌ను పరిశీలించారు. ఓర్వకల్లు వద్ద ఏర్పాటయ్యే డ్రోన్ల తయారీ పరిశ్రమను కాలేజీ డ్రోన్ ల్యాబ్‌కు అనుసంధానం చేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. అలాగే ఇన్‌స్టిట్యూట్ సమస్యలను విద్యాశాఖ మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంపీకి రిజిస్ట్రార్ రాజ్‌కుమార్ మంజీవాల్ క్యాంపస్‌లో చేపట్టిన పనులు, ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి వివరించారు.

అన్నపూర్ణా నమోస్తుతే



నేతాజీ విధిలో..



గీతా మందిరంలో నారాయణిగా..



బుధవారపేట సుంకులమ్మ ఆలయం వద్ద..



చౌడేశ్వరీ దేవి ఆలయంలో అన్నపూర్ణగా..

పర్యావరణ రక్షణలో భాగస్వాములు కావాలి



బహుమతి ప్రదానం చేస్తున్న వీసీ పీఎస్.షావలిఖాన్

కర్నూలు(హాస్పిటల్): సేవా పర్వ్ కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ పీఎస్ షావలిఖాన్ అన్నారు. వర్సిటీలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సేవా పర్వ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజాసేవ, సమాజ భాగస్వామ్యం, సమ్మిళిత పాలన స్ఫూర్తికి అనుగుణంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు సేవా పర్వ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వాయు కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. రిజిస్ట్రార్ వి.లోకనాథ మాట్లాడుతూ.. పర్యావరణ కార్యకలాపాల్లో స్థిరమైన అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యాన్ని నిర్ధారించడం ద్వారా వికసిత్ భారత్ దార్శనికతకు దోహదం చేస్తాయని చెప్పారు. అనంతరం పర్యావరణం, స్వచ్ఛమైన గాలి, ప్లాస్టిక్ రహిత జీవనం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు వీసీ, రిజిస్ట్రార్‌తో పాటు, పుదుచ్చేరి కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు పరమేశ్వర్ పన్నీర్ సెల్వం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహబూబ్‌బాషా, సీహెచ్.పాల్ కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు సత్వర అనుమతులు



హాజరైన జిల్లా అధికారులు, పారిశ్రామిక వేత్తలు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

కర్నూలు(సెంట్రల్): పరిశ్రమల స్థాపనకు వీలుగా ఆయా శాఖలకు నిర్దేశించిన గడువులోపు అనుమతులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి పరిశ్రమల ఎగుమతులు, పదోన్నతుల కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.

ఆమె మాట్లాడుతూ.. పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ప్రజల తలసరి ఆదాయం, జీడీపీ వృద్ధి చెందుతాయన్నారు. పరిశ్రమల అనుమతుల కోసం సింగిల్ డెస్కులో వచ్చే దరఖాస్తులను త్వరగా అనుమతించాలన్నారు. కాలుష్య నియంత్రణ బోర్డు వద్ద 19, కర్మాగారాల విభాగం, ఎస్పీడీసీఎల్, భూగర్భ జలాల శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు, లీగల్ మెట్రాలజీ వద్ద 57 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. కల్లూరు ఎస్టేట్‌కు నీటిని సరఫరా చేసే బాధ్యతను మునిసిపల్ కమిషనర్ తీసుకోవాలని ఆదేశించారు. షాపులలో బరువు తూచే యంత్రాలను 15 రోజుల్లోపు తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులకు సూచించారు. మరోవైపు పారిశ్రామిక ప్రోత్సాహకాలకు సంబంధించి రూ.35.92 లక్షల మంజూరుకు సంబంధించి సమావేశంలో ఆమోదం తెలిపారు. పరిశ్రమల శాఖ జీఎం అశోక్‌కుమార్, డీడీ జవహర్‌బాబు, మునిసిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్, ఏపీఐఐసీ జెడ్‌ఎం మధుసూధన్ రెడ్డి, పీసీబీ ఈఈ కిశోర్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, ఐలా సెక్రటరీ జగన్‌మోహన్‌రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

ఇసుకను అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థా యిలో అరికట్టాలన్నా రు. ఇందుకు సరిహద్దు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్సు కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. జిల్లాలో సీ.బెళగల్ మండలంలో కొత్తపేట, కే.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల, పాలదొడ్డి డిసిల్టేషన్ పాయింట్లకు అనుమతులు మంజూరైనట్లు చెప్పారు. అలాగే హొళగుంద మండలంలో ముడతమాగి, నందవరం మండలంలో నాగులదిన్నె, జొహరాపురం రీచ్‌లకు టెండర్లను పిలిచినట్లు తెలిపారు. ఆర్‌డీఓ సందీప్‌కుమార్, మైనింగ్ ఏడీ రవిచంద్, కర్నూలు టౌన్ డీఎస్పీ బాబు ప్రసాదు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ-ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం, జిల్లా క్రీడలు, ఇంటర్ విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన యూత్ ఫెస్ట్ మారథాన్ 5 కిలోమీటర్ల పరుగు పందెం, క్విజ్ పోటీల విజేతలకు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి బహుమతులను అందజేశారు. విజేతలకు నగదు, ప్రశంసా పత్రాలు, మెమొంటోలను అందజేసి అభినందించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ ఉన్నారు.

రెవెన్యూ, సర్వే శాఖల పనితీరు అధ్వానం

ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో రెవెన్యూ, సర్వే శాఖల పనితీరు అధ్వానంగా ఉందని కలెక్టర్ ఎ.సిరి అన్నారు. పీజీఆర్ఎస్, 1100 కాల్ సెంటర్లపై కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారుడు స్వయంగా ఎండార్స్‌మెంట్ ఇచ్చి అర్థమయ్యే రీతిలో వివరించి సంతృప్తి చెందేలా చూడాలని, అప్పుడు అర్జీలు రీఓపెన్ కావన్నారు. ఈక్రాప్ బుకింగ్ పూర్తి చేసి గురువారం ఉదయం 11 గంటల్లోపు నివేదికలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్‌ను ఆదేశించారు.

సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన అయ్యేలా సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 19వ తేదీ వరకు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కమర్షియల్ ట్యాక్స్ అధికారులతో మాట్లాడుతూ.. ప్రతి షాపు వద్ద జీఎస్టీ తగ్గినట్లు బోర్డులు పెట్టేలా చూడాలని ఆదేశించారు.

నాటుసారాను అరికట్టాలి



నవోదయం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలని, సారా దుష్పరిమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నవోదయం సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ డీసీ శ్రీదేవి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించాలన్నారు. నాటుసారాపై టోల్ ఫ్రీ నంబర్ 14405కు ఫోన్ చేసి తెలపాలని ప్రజలకు సూచించారు. ఎక్సైజ్ డీసీ మాట్లాడుతూ.. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలు చేస్తే ఎనిమిదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించబడుతుందని వివరించారు. అనంతరం నవోదయం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బీమా పరిహారం అందజేత

కర్నూలు(సెంట్రల్): ఉపాధి కూలీ కుటుంబానికి ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు బీమా పరిహారం అందజేసింది. నందవరం మండలం జొహరాపురానికి చెందిన అలుకూరు రామిరెడ్డి కరెంట్ షాక్‌తో చనిపోయారు. అతనికి ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకులో ఖాతా ఉండడంతో రూ.లక్ష ప్రమాద బీమా వర్తించింది. ఈ క్రమంలో బుధవారం మంజూరైన పరిహారం చెక్కును డ్వామా పీడీ పి.వెంకట రమణయ్య బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు మేనేజర్ బి.వీరారెడ్డి, కస్టమర్ గ్రీవెన్స్ మేనేజర్ షేక్ మహబూబ్‌బాషా, ప్రమోటర్ రామచంద్ర, వేణు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి

కర్నూలు: కర్నూలు-దూపాడు రైల్వేస్టేషన్ల మధ్య 244/1-243 కిలోమీటర్ వద్ద గుంటూరు నుంచి ఔరంగబాద్‌కు వెళ్లే రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ నజియా ముబీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పీఎస్ ఎస్ఐ లలిత బుధవారం సాయంత్రం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. మృతుడి వయస్సు 35 ఏళ్లు ఉంటుందని, లేత నీలం రంగు ఫుల్ టీషర్టు, నీలం రంగు లోయర్ ధరించి ఉన్నట్లు చెప్పారు. ఎడమ భుజంపై నల్లటి పుట్టు మచ్చ ఉంది. 5.7 అడుగుల ఎత్తు, ఛామన చాయ వర్ణం ఉన్నాడని వెల్లడించారు. మృతుడి సమాచారం తెలిసినవారు 77027 50778 లేదా 99088 89696 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ లలిత విజ్ఞప్తి చేశారు.

నవ దుర్గామాతల ప్రదర్శన



ఆకట్టుకున్న ప్రదర్శన

కర్నూలు సిటీ: దసరా నవరాత్రుల సందర్భంగా మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో బుధవారం నవదుర్గా మాతల ప్రదర్శన ఏర్పాటు చేశారు. 9వ తరగతి విద్యార్థులు సాక్షాత్తు అమ్మవారిని తలపించేలా వేషధారణలో తమ అభినయంతో అలరించారు. విద్యా సంస్థల ఎండీ కె.ఎస్.వి రాజశేఖర్, కరస్పాండెంట్ డా.గాయనీ రాజశేఖర్, హెచ్ఎం మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ యాప్‌లను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఆటో డ్రైవర్లకు తీవ్ర నష్టం కలిగిస్తున్న ఉబర్, ఓలా, రాపిడో వంటి యాప్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్, సీఐటీయూ న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, న్యూసిటీ అధ్యక్షుడు వై.నగేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రవాణా రంగాన్ని బడా వ్యాపారుల చేతుల్లో పెట్టి వారిని లాభ పరుస్తోందని, ఆటో డ్రైవర్ల పొట్టకొట్టడంతో పాటు ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. నాయకులు హుస్సేన్‌వలి, పెద్దమాలిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కల్చరల్ ఫెస్ట్‌లో ప్రతిభ

కర్నూలు(హాస్పిటల్): మహారాష్ట్రలోని పూణేలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగిన రెండవ జాతీయ స్థాయి కల్చరల్ ఫెస్టివల్ 2కె25లో కర్నూలుకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. టీజీ వెంకటేష్ ఫైన్‌ఆర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు హరినాథ్, మోక్షిత, పూజిత, యోషిక, భార్గవి, పూజిత, హర్షిత, శృతిక, షణ్ముఖి, గీతాన్వితలు ఈ పోటీల్లో పాల్గొని భారత్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు పొందారు. బుధవారం ఈ విద్యార్థులతో పాటు అకాడమీ అధినేత డాక్టర్ కేవీ.భార్గవ్ కుమార్‌ను టీజీ వెంకటేష్ సన్మానించారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ నియామకాలు చేపట్టాలి



ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల నియామకాల కోసం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 2600 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇందుకోసం డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు సిలబస్‌ను కూడా ప్రకటించిందన్నారు. అయితే నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో అర్హులైన అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 86 వేల మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఉన్నారని, వారికి బోధన చేయడం కోసం స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉందని, అయితే ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆశయం నీరుగారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా పాల్గొన్నారు.